# సుశి

"మీ గురించి చెప్పరూ ?" అన్నాడు సత్యం.

"నా గురించా ?" అంటూ ఆశ్చర్యంగా ఆగిపోయింది సుశీల.

"ఏం అంత ఆశ్చర్యపోతున్నారు ?"

"ఆశ్చర్యంగానే వుంది. నా గురించి ఏం చెప్పను ? నేను అతి సామాన్యమైన స్త్రీని. నాలో ఋషులరక్తం లేదు. నేను లాటరీలో పదివేలు సంపాయించలేను. సంఘాన్ని ఎదిరించలేదు. అతిసామాన్యంగా గడిచే నా జీవితంలో ఏముంది చెప్పేందుకు ?"

"నేను మీజీవితం సాహసాల్తోనూ, ఏవో అనుభవాల్తోనూ నిండిందని అనటంలేదు. అతి ప్రశాంతంగా కనిపించే మీ లోంచి ఆకథ ఎలా వస్తున్నాయా——?" అని తల ఎగరేశాడు సత్యం.

"భారతదేశంలోని ప్రతి పదో స్త్రీ జీవితం నా జీవితంతో ప్రతి కలుపుతుంది. అంటే యీ ముప్పైకోట్లలో ఎంతమంది నాలాంటివారు వున్నారో చూడండి. అందువల్ల నాలో ప్రత్యేకత లేదన్నానుగాని మీకు చెప్పకూడదనికాదు. నాకు చెప్పకూడని వేమీలేవు" అంది సుశీల సద్దుతూ.

"ఇది ఆఖరుసారి ఇంక అడగను" అన్నాడు సత్యం బుంగమూతితో.

సుశీల నవ్వి "కోపంతో మీ మొహం వుత్త బండబ్బాయి మొఖంలా వుంటుంది. నా జీవితంలో థ్రిల్స్ లేవు. వినండి నాలుగు ముక్కల్లో చెబుతాను"

సత్యం వుత్సాహంగా తలెత్తాడు.

"అమ్మ మొఖం ఎరగను. నాన్న బీదవాడు. ఆ బీదనాన్నకూడా పదోఏట పోయాడు. తదనంతరం బస్తీలోని మామయ్య యింటికొచ్చాను.

అత్త ఎంత చెప్తే అంత మామయ్యకి నన్ను వదిలించుకునేందుకు వాళ్ళ సాకో పెళ్ళిగూడా చేశారు. ఆయనకి నూకలులేక నన్ను బాలవితంతువుని చేసి పోయాడు. మనువర్తి పేరిట రెండువేలూ, యీ యిల్లూ వచ్చాయి. అప్పటికి పదహారోఏడు. సేవాసదనంలో జేరాను. స్కూల్ ఫైనల్ పాసయి, ట్రైనింగ్ చేశాను. రెండేళ్ళ క్రితం కార్పొరేషన్‌లో టీచరుగా చేరాను. నెలకి నలభైఎనిమిది వస్తాయి. యింట్లోవున్న ఆ రాజమ్మకి యిరవై రూపాయలు ఇస్తాను, భోజనం పెడుతుంది. ఆరునెలలనుంచీ మీరు చూస్తున్నారే- మేడమీద గది, ఆ గదిలో నా మకాం. ఆ రాజమ్మ యింకా నలుగురైదుగురికి వంటచేసిపెట్టి తన పొట్ట పోసుకుంటుంది. ఆ రాజమ్మ యీ సుశీలకి సాయం. ఇదీ యీనాటిదాకా నా చరిత్ర" అంది గుక్కతిప్పుకోకుండా.

"మీరు భలేవారు కట్టె-కొట్టె-తెచ్చె అన్నట్లు పాతికేళ్ళ మీ జీవితాన్ని పదిమాటల్లో చెప్పారే!"

సుశీల తలెత్తలేదు. యిద్దరూ సందుమలుపు తిరిగారు. సుశీల తలమీద నీరెండపడుతోంది. ఆ నీరెండలోని కాంతిని గుప్పెట్లో కిముడ్చుకోవాలనే తాపత్రయానికి ఎంత అర్థమో సుశీలని-అసలు సుశీలని పట్టుకోవాలని అనుకోడంలో కూడా అంతే అర్థం. సత్యం తలవంచుకు నడుస్తున్నాడు. సుశీల బహుచిత్రమైన మనిషి. తన కష్టాల్నీ-యిబ్బందుల్నీ ఎంత వోర్పుగా విందో! పైగా తనకేకష్టాలూ లేనట్లు మాట్లాడుతుంది. ముళ్ళ బాటల్లోంచి నడిచి అవి పువ్వులని సరిపెట్టుకునే సహనం యీమెకు ఎవరు నేర్పారో?

"లోపలికి రారూ?" అనే సుశీల కంఠంతో యీ లోకంలోకి వచ్చి పడ్డాడు సత్యం. మెట్లు ఎక్కుతున్నాడు. సుశీల రాజమ్మతో టీ పెట్టమని చెప్పేందుకు వెళ్ళింది.

ఆరునెలలనుంచి చూస్తున్నా, ఆగది నేడెందుకో సత్యానికి కొత్తగా కనపడింది. ప్రతి వస్తువా అమెరిగ్గా, పొందిగ్గా, శుభ్రంగా అమర్చింది సుశీల. సుశీలకు రానిపనేమిటో? అల్లికలు, కుట్లు అన్నీ నేర్పుగా కుట్టి టేబుల్‌మీద, కిటికీలకు తెరలు కట్టింది. ఎంతటి క్రమశిక్షణ! ఎంత పవిత్రత! వాలుకుర్చీమీద కూచున్నాడు. సాయంత్రపుగాలి ఏవో సందేశాల్ని మోసుకువస్తోంది.

అడుగుల చప్పుడుకు తలెత్తి చూశాడు సత్యం. సుశీల మొహం కడుక్కుని గదిలోకి వచ్చింది, అప్పుడు జ్ఞాపకం వచ్చింది సత్యానికి తను మధ్యాహ్నం భోంచెయ్యనట్లు.

బొట్టు పెట్టుకుంటూ "దీపాల వేళయింది, యిప్పుడు టీ ఏమిటి, భోంచెయ్యమంటోంది రాజమ్మ. మీరుకూడా రండి యిద్దరం భోంచేద్దాం!" అంది సుశీల.

తన ముఖంపట్టి కనుక్కుండా తను మధ్యాహ్నం భోంచెయ్యలేదని, యిద్దరూ ఒకే పంక్తిని కూచుని నవ్వుకుంటూ భోంచేశారు.

◆ ◆ ◆ ◆ ◆

ఆరు నెలల క్రితం సుశీలతో పరిచయం అయింది సత్యానికి.

ఒకనాటి మధ్యాహ్నం ఆఫీసులో కూచుని టపా చూసుకుంటున్నాడు సత్యం. ఆరుభాగాలుగా వచ్చింది ఒక నవలిక పోస్టులో. రచయిత ఎవరా అన్నట్టు చూశాడు సత్యం. ఎవరో స్త్రీ "సుశీ" అని రాసి పంపింది. అడ్రసుకూడా మద్రాసులోనే. మొదటి పేజీ ఎలావుంటుందో చూడబోయి, నవల చివరంటా పూర్తిగా చదివాడు. తనకి చాలా బాగుంది. కాని ఆకథను పారితోషికం యిచ్చి ప్రచురించే పాటిశక్తి తన పత్రికకు లేదు.

తేజస్సు ప్రతివారమూ వెలువడటమే బ్రహ్మప్రళయంగా వుంది. డబ్బు యివ్వకుండా అచ్చు వెయ్యడానికి మనస్కరించదు. డబ్బిచ్చే తాహతు తేజస్సుకి లేదు. సత్యంలో నిజాయితీ అనేది పూర్తిగా చావకపోవడంవల్ల డబ్బు తను యివ్వలేనని రచయితకు తెల్పుతూ-వారి ఆమోదం పొందిన తర్వాత ఆ రచనలు అచ్చువేసేవాడు.

ఇంట్లో ఉద్యోగం వెలిగించరాదా అనే భార్య ఎత్తిపొడుపులూ, పిల్లలు ముగ్గురికీ సరిఅయిన మందూ మాకూ ఇప్పించలేని తన నిస్సహాయం, డబ్బూ దస్కం వున్నవాళ్ళు పత్రికలూ, పుస్తకాలూ వేసి విజ్ఞానం నలుదెసలా వెదజల్లాలిగాని, భార్యాపిల్లల్ని పోషించలేని నీ కెందుకీబాధ" అని హితుల బాధలూ, అన్నిటినీ సహిస్తూ తన జీవితలక్ష్యం అనుకుని అలా ఒంటిగా "తేజస్సు"ని లాక్కొస్తున్న సత్యానికి సుశీల రాసిన 'తపన' ఏదో కొత్త సందేశం మోసుకొచ్చింది.

తను పైకం యివ్వలేనని, అందుకు అంగీకరిస్తే రచన తను పత్రికలో వేసుకుంటాననీ రాసిన ఉత్తరం చూసుకొని సుశీల నవ్వుకుంది. ఆ పత్రిక సంపాదకుడు వృత్త అమాయకుడు—అని వెంటనే కనుక్కుంది. అసలు రచనలు వెయ్యడమే మహోపకారంగా భావించే ఎడిటర్లు చాలామంది వున్నారు. దాని-పారితోషికం యివ్వలేనంటూ మనవి చేసుకునే మనిషి యితనొక్కడే బోలు !

పారితోషికం యివ్వక్కర్లేదని సుశీల తక్షణం రాసింది. 'తపన' తేజస్సులో పడింది

తర్వాత సత్యం తన కృతజ్ఞత తెల్పుకోడానికి జార్జిటవున్‌లోని సందులన్నీ తిరిగి చీకటి-చీకటి పడుతూండగా సుశీల వుండే యిల్లు కనుక్కున్నాడు. అది శనివారం సాయంత్రం రాజలక్ష్మి బియ్యం ఏరుకుంటోంది. సుశీల సూదీ దారం పుచ్చుకుని ఏదో కుడుతోంది. ఫలానా నెంబరు యిల్లు యిదేనా అని ప్రశ్నిస్తూ ప్రవేశించాడు సత్యం.

సుశీల తలెత్తింది. వుంగరాలు చెరిగిన క్రాఫు, ఆ వుంగరాలు నుదురు మీద పడుతున్నాయి. కళ్ళల్లో అసంతృప్తి అశాంతి, చామంచాయ పెద్ద ముక్కు విశాలమైన నుదురు కాళ్ళకి చెప్పుల్లేవు. తెల్లలాల్చి, కలకత్తా అంచు పంచె. బట్టలుకూడా కాస్త మాసివున్నాయి. తటాలున చూడగానే మనిషి పెద్దమనిషిలా కనిపించాడు.

సమాధానం చెప్పకుండా సుశీల తనని ఆపాదమస్తకం పరిశీలిస్తూంటే సత్యం ఖంగారు పడ్డాడు. కొంపతీసి తను తప్పునెంబరు యింట్లో ప్రవేసించలేదుకదా అని తటపటాయిస్తున్నాడు.

"సుశీలగారు ఉండేది ఈ యింట్లోనేనా ?"

"నేనే-మీకేంకావాలి ?"

సత్యం ఖంగారు పడ్డాడు. ఆడంబరంలేని యీ సుశీల-తను ఊహించుకున్న రచయిత్రితో సరిపోలడంలేదు. ఆకళ్ళు మటుకు తనని చాలాస్నేహంగా పల్కరిస్తున్నాయి.

ఒకరినొకరు ఎరుకపర్చుకున్నారు. ఆ తర్వాత సత్యం ప్రతి శనివారం సుశీలని కలుసుకుంటుండేవాడు. ఆపైన సుశీల అతనికి రచనలద్వారా

చాలా సాయంచేసేది. అతనివద్ద వొక్క కానీ పుచ్చుకునేదికాదు ఆరు నెలలలో సుశీల రచనలవల్లనో, సుశీల సత్యానికిచ్చిన ఆత్మబలం వల్లనో పత్రిక మూడు వేలదాకా అమ్ముతోంది. సత్యం తను సుశీలకు చాలా బాకీపడుతున్నానని అనుకునేవాడు సత్యం. పత్రిక కాస్త ఒక దారినపడింది గాని యింటి వ్యవహారాలూ, డబ్బు దస్కం అవి మొదలుపెట్టిన చోటునే వున్నాయి. సత్యం పెద్దపిల్లకు ఆరు, రెండోదానికి మూడు, చంటిపిల్లకు తొమ్మిదోనెల. దానికి పోతపాలు, భార్యకి రోగం, వీటికితోడు భర్త అప్రయోజకుడనే కసి-యిదీ అతని జీవిత క్రమం. డిగ్రీ పుచ్చుకోగానే వున్న కాస్త ఆస్తీ జర్నలిజంలో పెట్టేశాడు. మరోవుద్యోగం చేసేందుకు అతని ఆత్మ వొప్పడంలేదు. 'తేజస్సు'లో పోతున్న అతని విశ్వాసాన్ని సుశీల లేవనెత్తింది, సుశీలకి తన కష్టాలను చెప్పడంలో సత్యం కొంచెంకూడా వెనుకాడలేదు. సుశీల అన్నీ వోపిగ్గా వినేది. చాలా తక్కువ మాట్లాడేది. సత్యంతో ఏ వొక్కనాడు 'తనకి యిబ్బంది అనేమాటకూడా అనలేదు; అతని స్నేహంతో సుశీల హృదయ కవాటం తెరచుకుంది

* * * *

1941 రెండవ ప్రపంచ యుద్ధం, సత్యం పత్రిక కాస్త దారిలో పడుతోంది, సంసారంకూడా బాగానే సాగుతోంది. ఒకశనివారం సుశీల యింటికొచ్చాడు. ఏవోమాటల్లోపడి "తనదగ్గిర మూడువేలుంటే చక్రం తిరుగుతుంది" అన్నాడు సత్యం.

"ఎల్లా ?"

"నేనెరుగున్న ప్రెస్సువాడు యుద్ధానికి భయపడి టైపులూ, మిషనూ అమ్ముకుపోతున్నాడు. 3500 రూపాయలు చెబుతున్నాడు. నాదగ్గిర 500లున్నాయి. మిగతాది వుంటేనా ?"

"విషయమేమిటో స్థిమితంగా చెప్పండి" అంది సుశీల చేరుమాలు చివర నగిసీచేస్తూ.

సత్యం సమస్తం విశదంగా తెలియపర్చాడు, పత్రికకు ప్రెస్ వుంటే ఎంతోలాభం. ప్రింటింగ్ ఛార్జీలు కలిసివస్తాయి. ఎంతలేదన్నా నెలకి మరో మూడొందలు మిగులుతాయి-అంటూ గుక్కతిప్పుకోకుండా లెఖలూ ఆవీ చెప్పాడు.

"మా ఆవిడ వంటిమీద నగలు అమ్మదామని వుందిగాని, ఆమెకి నామీదా-నా ప్రయోకత్వంమీదా కొద్దిగాకూడా నమ్మకంలేదు.

"ప్రెస్‌వాడు ఎన్నాళ్ళదాకా ఆగుతాడు?"

"ఇంకా పదిరోజులు వుండవచ్చు, అయినా అది మన తాహతుకి మించినపని" అని ఊరుకున్నాడు సత్యం.

సత్యం వెళ్ళాక సుశీల చాలాసేపు ఆలోచనల్లో పడింది. "మూడు వేలుంటే చక్రం తిరుగుతుంది. పడే పదే వినిపించాయి ఆ మాటలు. తనకి మటుకు ఎవరున్నారు?" వుండేందుకు ఇల్లుంది. జీవనోపాధికి వుద్యోగంవుంది. అత్తారిచ్చిన రెండువేలూ, వడ్డీ చిన్నం చిదరా, మెళ్ళో మూడుపేటలు గొలుసూ యివన్నీ కలిపితే మూడువేలూ అవకేం? ఒక మంచివాడు బాగుపడతాడు.

పై శనివారం సత్యం వచ్చాడు. చాలాసేపు ఖబుర్లయాయి. "ప్రెస్సు వాడు ఏమయాడు? అని ప్రశ్నించింది సుశీల.

"యింకా ఎవరూ ఎక్కడంలేదు. నేను చాలాచోట్ల ప్రయత్నించాను. లాభం లేకపోయింది" అన్నాడు నిరుత్సాహంగా

"మీరు సోమవారం మధ్యాహ్నం పన్నెండు గంటలకి ఒకసారి రాగలరా? అంది సుశీల

"అల్లాగే" అన్నాడు సత్యం.

సుశీల ఏనాడూ తనని ఏపనికీ సాయంరమ్మని అడగలేదు. అకస్మాత్తుగా సోమవారం రమ్మనడం సత్యానికి వింతగా తోచింది. తల బద్దలుకొట్టుకున్నా కారణం దొరకలేదు.

సోమవారం సత్యం వచ్చేసరికి సుశీల సిద్ధంగావుంది. ఇద్దరూ చైనా బజారు వైపు నడిచారు, సుశీల యీ విషయం, ఆవిషయం మాట్లాడుతోంది.

నెమ్మదిగా బాంక్ గుమ్మందగ్గిర ఆగారు. సుశీల మెట్లుఎక్కుతూ "అన్నట్టు చెప్పటం మరిచాను, నా మనవర్తిత్తాలూకు రెండువేలూ, యింకా నగా నాణెం అమ్మిన మొత్తం అంతా కలిసి మూడువేలు వున్నాయి. అవి తీసుకుందామని మిమ్మల్ని రమ్మన్నాను. ఆ డబ్బుతో ప్రెస్ కొనండి" అంది సత్యంవంక చూడకుండా.

కాళ్ళకింద భూమి కుంగిపోతున్నట్టు అనిపించింది, సత్యానికి. నిజమా! తన చెవులను నమ్మలేకుండా వున్నాడు. సుశీల తనసర్వస్వం యిచ్చేస్తోందా? తనీ త్యాగానికి అర్హుడా? వణుకుతున్న అతని వేళ్ళని చేతులోకి తీసుకుని, మెట్లకింది సుశీల సత్యం కళ్ళమ్మట నీరు తిరిగింది.

వరండాలో బెంచీమీద కూర్చుని సత్యం తనకీడబ్బువద్దని చెప్పాడు. తనకోసం సుశీల యిలాచేయటం మంచిది కాదన్నాడు.

"దీంతో పత్రిక బాగుపడుతుంది అయినా మీకోసం కాదు పత్రిక కోసం" అంటూ అతని మాటల్ని నెట్టేసింది.

చివరికి ప్రెస్ ఆమెపేరనన్నా కొననిమ్మన్నాడు. సుశీల కళ్ళెర్ర పడ్డాయి. "ప్రెస్ నాపేర కొనుక్కోనేట్టయితే మిమ్మల్నెందు పిల్చేదాన్ని. వూరుకోండి పిచ్చిమాటలూ మీరూనూ"

భార్యతో తన అదృష్టముగురించి చెప్పటమా మానడమా? సుశీల ఆ సాయంత్రం మాటల సందర్భంలో యీ విషయం మనిద్దరిమధ్య పెదవి దాటగూడదు అని ఆంక్ష పెట్టింది. పైగా యీసంగతి భార్యతో చెపితే, మరో అర్థం కల్పించవచ్చు. సుశీల స్నేహంకోసం యిచ్చిందంటే అది ఆమెకందని సమస్య.

రోజులు దొర్లుతున్నాయి. సత్యం ప్రయోజకుడయ్యాడు. వృద్ధిలోకి వచ్చాడు. నెలనెలా రెండుమూడు వందలు మునుపటికంటె ఎక్కువ మిగులుతున్నాయి. రెండుమూడుసార్లు "యీ అయిదువందలూ వుంచండి" అంటూ సుశీలకి యివ్వబోయాడు.

"నేనుమీకు అప్పుగా యివ్వలేదు యిస్తేపుచ్చుకునేదాన్ని" అని నవ్వి వూరుకునేది ఆమె.

రాజుల్ని బికారులుగాచేసేయుద్ధం, బికారుల్ని రాజులుగాచెయ్యడం సహజం. యుద్ధజ్వాలలు అలుముకుంటున్నాయి. ఎక్కడవాళ్ళక్కడ పట్నం నుంచి పారిపోతున్నారు. సత్యం భార్యా పిల్లల్ని పుట్టింటికి పంపించేశాడు.

"నువ్వెందుకు ఈ పట్నంలో? వెళ్ళిపోరాదా? ఇక్కడ ఆడవాళ్లు వుండే పరిస్థితులు కావు" అన్నాడు. భార్య వెళ్ళిన వారానికి సుశీలతో సత్యం

"మీకు చుట్టాలూ, పక్కాలూ వున్నారు నా కెవరున్నారు? ఎక్కడికిపోయినా ఒకటే. ఇక్కడైతే నా సొంతయిల్లు అని అన్నావుంది. పొరుగూర్లో నేను చేసేదేమిటి?" అంది సుశీల.

మద్రాసునిండా ఖాళీయిళ్ళు పనివాళ్ళు దొరకటం మహాకష్టంగా వుంది. బ్లాక్ అవుటు. హోటళ్ళులేవు, షాపుల్లేవు, సినిమాల్లేవు నానాఖంగారుగా వుంది. డబ్బుమటుకు, సత్యానికి రెండుచేతులా దొరుకుతోంది. ఈ మధ్య భార్యా పిల్లలూ లేకపోవటం, పూర్వమంత ఆర్థికచిక్కులు లేకపోవడం వల్లా సత్యానికి కాస్త వూపిరి తీసుకునే సమయం దొరుకుతోంది. అతను ఎక్కువకాలం సుశీలవద్దే గడుపుతుండేవాడు.

కిందవాటాలో వుండే రాజమ్మ అందరికిమల్లే ప్రాణాలకి భయపడి పట్నంవదలి పారిపోయింది. సుశీలవొక్కర్తే ఆడదియింట్లో వుండటంఎలా? తను సాయంవుంటానన్నాడు సుశీలతో, సందులు, బజార్లు నిర్మానుష్యం సుశీల అలాగే స్కూలికి వెళ్ళివస్తోండేది. స్కూళ్ళకి శెలవిచ్చారు. సుశీల ఒకనాడు సత్యంతో "ఎ. ఆర్. పి. లో జేరుతున్నాను" అంది.

"స్కూలులేదుగా యింట్లోవుండరాదూ యీబాధలన్నీ ఎందుకు?" అన్నాడు ప్రూఫులు దిద్దుతూ సత్యం.

"ఇంట్లో తోచవద్దూ? యిరవై నాలుగు గంటలూ ఏంచెయ్యనూ?" అంది బద్ధకంగా ఒళ్ళువిరుచుకుంటూ.

"నేనున్నానుగా" అన్నాడు కొంటెగా నవ్వుతూ.

"మీరుంటే-మీతోనేనా ప్రపంచం" అంది చురచూస్తూ సుశీల.

సత్యం అథఃపాతాళానికి కృంగినట్లు వలపోశాడు. ఈ రెండునెలల లోనూ సత్యం సుశీలతనని ఎంత ప్రేమించింది తెలుసుకున్నాడు. బయట పత్రికల్లో పనిచేసే మొగవాళ్ళు సంసారాన్ని పంపి, తిండి తిప్పలులేక యిబ్బందులుపడుతుంటే తను హాయిగా సుశీలచేత్తో చేసిన పదార్థాలుతిని ఖుషీగా బతుకుతున్నాడు. ఇటు పత్రికదివిటీలాగ వెలుగుతోంది. స్త్రీతను ప్రేమించిన పురుషుణ్ణి ఏ ఔన్నత్యాలకి గొనిపోతుందో యీనాడు తెలిసింది సత్యానికి. సత్యం తన వైవాహిక జీవితంలో స్త్రీని పిల్లలుకనే యంత్రంలా- భర్తమీద విసుక్కునే మనిషిలా, ఓర్పులేని మోతలాచూశాడు. అతనికి సుశీల సాంగత్యంతో స్త్రీ అంటేఏమిటో మొట్టమొదటిసారి తెలిసింది.

సుశీల తనది. తను సుశీలవాడు. తమ జీవితాలు పెనవేసుకుని పోయినాయని అనుకునే వేళకి సుశీల యీ మాటలు అంది.

సుశీల తనకు అర్థంకాదా? తను అర్థంచేసుకోలేడా? తను లేనిదే బ్రతకలేను అన్నట్లు ప్రవర్తించి, కఠినంగా యిలా మాటల్తో నొప్పిస్తుందే!

"ఆ ప్రూఫులు కానియ్యండి" అన్న సుశీల కేకతో తలెత్తి చూశాడు.

ఎదురుగుండా కాఫీతో నిల్చుంది సుశీల. ఆ కళ్ళు తనను పిల్చి ఏడిపిస్తున్నాయి. తేరిపార చూస్తున్నాడు ఆమె కళ్ళల్లోకి.

నుదుటిమీదనుండి ఉంగరాల్ని పైకిత్తోస్తూ, "బండబ్బాయికి పని జరగదు—వూ" అంది సుశీల, అతని తలని గుండెలకు హత్తుకుంటూ. సత్యం ప్రపంచాన్ని మర్చిపోయాడు.

* * * *

నాలుగోనాటి సాయంత్రం సత్యం యింటికొచ్చేవేళకి సుశీల సత్యం కోసం బనియనులు కుడుతోంది. "సుశీ, నిన్నరాత్రి బాంబు వేశారురట. మనకు తేలీనేలేదు" అన్నాడు పక్కన జేరుతూ.

"ఊఁ" అంది తలెత్తకుండా.

"మనింటిమీద పడుంటేనో?"

"ఏం పడితే—అంతకంటే మంచిచావు నే కోరుకోను" అంది సత్యం తలని వొళ్లోకి లాక్కుని, నుదుటిమీద జుట్టుని పైకిత్తోస్తూ.

ఆ క్షణాన బాంబు పడిపోతే ఎంత బాగుండును — అనుకున్నాడు సత్యం. ఈమాట ప్రతిక్షణం అతనికి జ్ఞాపకం వస్తోంది. అందరికి యుద్ధం ఒక భీభత్సం, తనకది సుందర స్వప్నం.

* * * *

కొంచెం వత్తిడి తగ్గింది. తాళాలు వేసుకున్న యిళ్లు తెరచి మగవాళ్లు ప్రవేశిస్తున్నారు. రాజమ్మకూడా తిరిగి వచ్చింది. ఇంకో రెండు నెలలకి సత్యం భార్యకూడా తిరిగివచ్చింది ముగ్గురు పిల్లలతోనూ.

1945 లో యుద్ధం పూర్తిఅయింది. సత్యం జీవితంలో అనేక మార్పులొచ్చాయి. యుద్ధంలో చాలామంది వేలూ, లక్షలూ సంపాయించారు.

ఎలా అని అడిగితే, అది వారికే తెలీదు. బ్లాక్ అనండి, ఏది అనండి — ఒక లక్ష రూపాయలదాకా ఆస్తి సంపాయించాడు సత్యం. చవగ్గా, ఎవాక్యుఏషన్ స్కైములో, చక్కటి మూడు బంగళాలు కొన్నాడు. అతని చక్రం తిరిగింది. డబ్బుతో పాటు పేరుప్రతిష్ఠ లొచ్చాయి. పత్రిక రెండు మూడు వేలనుంచి, యిరవై ముప్ఫై వేలదాకా అమ్ముడుపోతోంది. ఎన్ని పనులున్నా ప్రతి శనివారం రెండు గంటలనుంచీ, రాత్రి పదిగంటలదాకా సుశీలతో గడుపుతూండేవాడు.

కార్లూ, బంగళాలూ, అధికారం సత్యం జీవితవిధానాన్ని మార్చేశాయి. కాని సుశీలలో కించిత్తుకూడా మార్పులేదు.

"మాంబళంలో మేడ కట్టిస్తున్నాను" అన్నాడు సత్యం

"బాగుంది" అంది సుశీల.

"నీకోసం" అన్నాడు.

"నా కెందుకు! ఈయిల్లు నా కుందిగా ?"

"ఈ యిల్లు పాతబడిపోయింది. సందులూ అవీ గలీజుగా వుంటుంది. అది నీకోసం" అన్నాడు పురుషదర్పంతో.

"అలాగా" అంది తలొంచుకు సుశీల.

"ఎన్నాళ్లనుంచో చెప్పాలనుకుంటున్నా. నువ్వింక వుద్యోగం మానెయ్యరాదూ ?"

"ఏం ?" అంది సుశీల.

" ఈ డబ్బంతా నీది కాదూ ? హాయిగా మాంబళం యింట్లో నువ్వు ఉండవచ్చు."

"ఊఁ"

"నెలకొచ్చే ఆ ఎనభైరూపాయలకే యీ కష్టం దేనికి ? యింత వుండగా నువ్వుకూడా సంపాయించడం ఎందుకు ? యీ యిల్లు అద్దెకివ్వడమో, అమ్మడమో చేసేసరి" అన్నాడు ధైర్యంగా.

"నే నెందుకు వుద్యోగం మానాలి ? యీ యింట్లోంచి కదిలే అవసరం నాకేట్టే కనపడటంలేదు. సందులూ, గొందులూ అంటారా ? నాకివి పది పదిహేనేళ్లనుంచి అలవాటు. అందువల్ల ఫరవాలేదు. మీరే కట్టబోయే యింట్లో వుండండి. నే సంపాయించుకునేది నాకోసం"

సుశీల సమాధానం చెప్పి లోపలికి వెళ్ళిపోయింది. సత్యం హతుడై కూర్చుండిపోలేదు. అలాగే కాసేపుండి ఇంటిదారి పట్టాడు.

*   *   *   *

మరునటి శనివారం సత్యం సుశీల ఇంటికొచ్చాడు. సుశీల ఏదో అల్లుతోంది. తలెత్తి చూసింది. గుమ్మంలో సత్యం.

మొట్టమొదటిసారి తను చూసిన సత్యానికీ-ఇతనికీ ఎంత తేడా. ట్వీట్ సూట్‌లో సత్యం. చేతులో పుస్తకాలకి బదులు సిగరెట్ డబ్బా. తీర్చిదిద్దిన క్రాపు కళ్ళల్లో అశాంతి కాదు అహంభావం. కాస్త తెల్లబడ్డాడు. పూచలావుండే సత్యం బొద్దుబారాడు.

ఇద్దరూ మెట్లెక్కారు.

"ఆనాడు నామాట పూర్తిగా వినకండానే నీకు కోపం వచ్చి వెళ్ళిపోయావు. నే చెప్పేది విని మరీ సమాధానం చెప్పు" అన్నాడు కుర్చీలో కూలబడి.

సుశీల తలెత్తలేదు. చేతిలోని అల్లికతో గుమ్మంలో కూర్చుండిపోయింది.

"మేడ పూర్తిఅయింది. వొచ్చే నెలలో గృహప్రవేశం" అన్నాడు సుశీలవంక పరిశీలనగా చూస్తూ.

సుశీల కళ్ళెత్తలేదు.

"గృహప్రవేశానికి ముందే నిన్ను పెళ్ళిచేసుకోవాలని నా వుద్దేశం. తర్వాత నువ్వు నాభార్యగా ఆ ఇంట్లో అడుగెట్టవచ్చు. అందుకోసమనే వుద్యోగం మానుకోమన్నాను" అన్నాడు సిగరెట్టు ముట్టించి.

సుశీలనుంచి సమాధానం రాలేదు.

"ఈ ధనం-హోదా-దర్జా అన్నీ నువ్వు పెట్టిన భిక్ష. నా ప్రతి ఒక్క ఆనందం నువ్వు పంచుకోవాలి. నువ్విలా టీచరుపని చేస్తుండటం మన హోదాకు తగదు. నిన్ను పెళ్ళాడి మాంబళం ఇంట్లోకి తీసుకెళ్తాను. పిల్లలూవాళ్ళూ పూర్వపు మైలాపూర్ ఇంట్లో వుంటారు. నీకూ వాళ్ళకీ సంబంధం వుండదు"

"చెప్పడం అయిందా-ఇంకా ఉందా" అంది సుశీల.

ఆకళ్లను చూసేవేళకి సత్యానికి భయమేసింది.

"మీకు పూర్వం ఒకసారి చెప్పాను, డబ్బు అప్పుగా ఇవ్వలేదని. పెండ్లి చేసుకునేందుకు మీరు సిద్ధంగా ఉన్నా నేనులేను. మీహోదాకు తగకపోయేందుకు నేనెవర్ని? మీకూ నాకూ స్నేహం తప్ప చిన్న నెత్తు బాంధవ్యంలేదు. నా ఉద్యోగం మానను. యీ ఇల్లోంచి కదలను. మీపెద్ద పెద్ద కార్లను యీ గల్లీల్లో వుంచి యిబ్బందులు పడకండి. యిదే నా సమాధానం మీకు స్త్రీ అంటే ఏమిటో తెలీదు" అని కిందకిదిగి వెళ్ళి పోయింది సుశీల.

ఈసారి సత్యానికి భయం వెయ్యలేదు. సుశీలమీద కోపంవచ్చింది. అతని అహం దెబ్బతిం-! తనంతవాడు వెళ్ళాడు. తానంటే నిరాకరించింది. తనకీ నాకూ సంబంధం లేదుట. ఆడదే ఆమాట అంటే మొగవాడుతనకేం? తను కిందకి దిగి దేవులాడుతున్నకొద్దీ సుశీల కొండెక్కుతోంది. కనపడక పోతేనేగాని సుశీలకి తన విలువ తెలీదు.

కారులో కూచున్నాడేగాని అతని మనసు మనసులోలేదు. సుశీల మొదటి నుంచి తన చెయ్యిపైన వుంచుకుంటూ వచ్చింది. ఆఖరికి తనచేతి నుంచి ఒక బహుమతీ అన్నా పుచ్చుకోలేదు మొదట్లో ఆడబ్బు పత్రికకు ఖర్చుపెట్టండి-అంటూ తప్పించుకు వచ్చింది. తనకు డబ్బు ఆడుతున్నప్పటి నుంచీ ఒకపక్క బయటపని, మరొకపక్క సుశీల కావాలని దూరం అవు తోంది. ఎటుచూసినా సుశీలకే తను అప్పపడ్డాడు.

ప్రేమించిన స్త్రీకి పురుషుడు తనిచ్చేనకంటే ఇంకేం ఇవ్వగలడు? భార్యగా చేసుకుంటానన్నాడు. సమస్తం పంచుకుందామనుకున్నాడు.

* * * * *

ఆఏటికా యేడు గడుస్తోంది. మళ్ళీ సత్యం సుశీల గుమ్మం తొక్క లేదు. సాధ్యమైనంతవరకూ ఆమెను మర్చిపోజూస్తున్నాడు. డబ్బు సంపా దనతో వూపిరి ఆడటంలేదు.

ఇద్దరు ముగ్గురు, సాయంత్రో ఫిలింకంపెనీ పెట్టాడు సత్యం. సత్యం ముట్టిందల్లా బంగారం అవుతోంది. మొదటి రెండు పిక్చర్లతోనే సిరి పండుకుంది. మిలియనీర్ అయ్యాడు.

పదిలక్షల ఆసామి సత్యం. మాంబళంలోని పెద్ద బంగళా టెర్రస్ మీద పడుకుని నక్షత్రాల్ని చూస్తుంటే, నెలకి వంద రూపాయలు సంపాయించుకునే సుశీల జ్ఞాపకానివచ్చేది. ఈ లక్షలు తన నేర్పువల్ల వచ్చాయా, లేక ఆ మహాత్తు సుశీల డబ్బులో వుందా ఇది తెగని సమస్య. ఈ పునాది గురించి తనకీ, సుశీలకీ తప్ప మరో ప్రాణికి తెలియదు. ఇప్పుడు ఇద్దరికీ మధ్య సంఘం ఎత్తయిన గోడలు కట్టింది. శనివారాలు ఎవరికీ చెప్పుకోలేని బాధతో కుమిలిపోయేవాడు సత్యం.

ఆరునెలల క్రితం సత్యం పెద్దమ్మాయికి యాభైవేలు ఖర్చుచేసి. దేవేంద్ర వైభవంగా వివాహం చేశాడు. పెళ్ళిపందిరి కళ్ళ పండుగగా వుందని చూసినవారు అన్నారు. ఇంత సందడిలో, గౌరవంలో. అతిథిమర్యాదలలో సుశీల లేదు. సుశీలకి ఆహ్వానమైనా వెళ్లిందో లేదో? అతనామె జ్ఞాపకాని, ప్రయత్నం చేశాడు.

సత్యం భార్య సోషల్ వర్కర్ అయింది. పెద్ద పెద్ద సభలకీ వాటికీ హాజరవుతోంది. భర్త ఆర్జన తనవల్లే పెరిగిందని ఆమె ఉద్దేశం. నాగరిక చిహ్నాలయిన క్లబ్బులూ, గుర్రపందాలూ, ప్రతి సమ్మర్‌కీ కొడైకెనాలు వెళ్లి గడపడం - యిలాంటివి అన్నీ అలవరచుకుంది.

యుద్ధంలో సంపాయించిన ధనం, వాటి తాలూకు లాభాలకీ ప్రతిధనవంతుడికి మల్లేనే టాక్సులు సరిగా కట్టడం మానేశాడు సత్యం. ఈ మధ్య మూడు నెలలనుంచీ ఇన్‌కమ్‌టాక్సు ఆఫీసరుని తప్పించుకోవడంలో అతను నిమగ్నుడయాడు. ఒకటా రెండా నాలుగులక్షలు కట్టాలి. గవర్నమెంటుకు కట్టాలిన డబ్బు.

వేసంగికి భార్యా పిల్లలూ, కొడైకనాల్ వెళ్ళారు.
నాలుగు లక్షలు ఎక్కడినుంచి తేవాలి? అదే సమస్య. భార్యా పిల్లలూ వెళ్లి నాలుగురోజులయింది.

సత్యానికి రెండు రోజులనుంచీ జ్వరం తగుల్తోంది. అంత పెద్దయిల్లు బావురుమంటోంది. ఇంట్లో ప్రతివారూ తన ఆజ్ఞల్ని పాలించేవారేగాని ప్రేమతో చూసేవారు ఒక్కరూ లేరు. ఆఖరికి భార్యకూడా తనని చూసి దడుస్తుంది. మనసిచ్చి మాట్లాడదు. ఇంత భోగంలోనూ ఏదో వెలితి - ఆరాటం తనని బంగారు పంజరంలో బంధించినట్లుంది సత్యానికి.

వారం రోజులదాకా ఆఫీసు పనులు చూడననీ, ప్రతిపనీ అలావుంచమనీ శక్రటరీకి క్రిందటిరోజు ఫోన్ చేశాడు. శరీరమంతా ఏదో నీరసంగా వుంది.

సాయంత్రం నాలుగయింది. గదిచుట్టూ వట్టివేళ్ళు ఎంతో చల్లగా హాయిగా వుంది, మంచంమీద పడుకన్నాడు. ఎదురుగ్గా కాలెండరు, ఏప్రిలు ఆరో తేది. ఏవేవో జ్ఞాపకంవచ్చాయి.

తనకి బాగా జ్ఞాపకం. పత్రిక ఆరో తేదీనే మొట్టమొదటిసారి సుశీల యింటికి తను వెళ్ళింది ఒక దశ గడిచింది. ఆమె స్నేహంతో తన జీవితంలో ఎంతమార్పు! కాని ఆమె జీవితంలో మటుకు తను వీసమయినామార్పు తేలేకపోయాడు.

చిత్రం ఏడాదినుంచి పూర్తిగా మర్చిన సుశీల యీనాడు జ్ఞాపకం వచ్చింది. జ్వరంగావుంది. సుశీల దగ్గిరకు వెళ్తే! తనని లోపలికి రానిస్తుందా? ఐశ్వర్యంలో తను మొహంచాటేశాడే! ఆఖరికి పిల్ల పెళ్ళికికూడా పిలువలేదు కాని సుశీలచెయ్యి తగిల్తే తనజ్వరం యిట్టే తగ్గుతుంది. ఒక్కసారి మనసు విప్పి మాట్లాడితే యీ భారంపోతుంది.

ఈ నాలుగేళ్ళలో సుశీలలో ఏలాంటి మార్పువచ్చిందో! తన వియోగం ఆమెను క్రుంగదీసిందా? జబ్బుచేసివుంటుందా! ఆఖరికి తను ఆమె క్షేమం -అన్నా కనుక్కోలేదు. సుశీల కనుక్కుంటూనే వుంటుంది, తనే క్రూరుడయిపోయాడు.

రెండురోజులైంది గడ్డంగీసుకుని. గడ్డంమాసి, బట్టలు నలిగివున్నాయి. బాల్కనీలోకివచ్చి చూశాము. చీకటిపడబోతోంది. గబగబ పర్సు జేబులో వేసుకు మెట్లు దిగాడు.

డ్రైవరు తలుపుతీసుకునిపోర్టికోలో నిలబడ్డాడు. కారువద్దని తలవూపి సందు చివరిదాకా తలవంచుకు నడిచాడు. పక్కనేపోయే టాక్సీపిల్చి సుశీల అడ్రసు ఇచ్చాడు.

అతని హృదయం జ్ఞాపకాలతో అనుమానాలతో వూగిసలాడుతోంది కారుకదలనట్లేవుంది. ఏదో-ఏదో! బుర్ర తిరుగుతోంది.

టాక్సీ ఇంటిముందు ఆగింది. వాడిచేతులో నోటుపెట్టి దిగాడు సత్యం. గుమ్మంలో అడుగెట్టాడు. సుశీల వరండాలో కూచ్చుని స్వెటర్ అల్లుతోంది. తలెత్తిచూసింది. సత్యం ఒక్కగంతున వళ్ళోవచ్చిపడి ఏడుస్తున్నాడు.

సుశీల కదల్లేదు, పదినిముషాలకి తలెత్తాడు సత్యం. మొదటిసారి సుశీలకంట్లో కన్నీరుచూశాడు. మాసినగడ్డం, పాలిన చెక్కిళ్ళు, మురికిగుడ్డలూ దశ క్రిందచూసిన సత్యం తిరుగా అలాగే ప్రవేశించాడు. నుదుటిమీదపడిన నెరిసినజుట్టుని పైకితోస్తూ-"పిచ్చిబాబూ" అంది ప్రేమగా.

సత్యం తలని సుశీల బుజాల్లో దాచుకున్నాడు.

మేడమీదికిపదంటి కాఫీతెస్తాను, అని రెక్కపట్టుకు తీసుకెళ్ళింది సుశీల.

దుప్పటి దులిపి అతన్ని పడుకోబెట్టి, కింద కెళ్ళి కాఫీ తెచ్చింది. సత్యం బుద్ధిమంతునిలా కాఫీతాగి-సుశీల వళ్ళోతలపెట్టుకు పడుకొన్నాడు.

ముఖం కడిగించి, గుడ్డలు మార్పించి, అతను తిన్నచారూ, అన్నపు గిన్నె కిందకుపట్టుకెళ్తూ "కళ్ళుమూసుకు పడుకో-క్షణంలో వస్తున్నా" అంది మెట్లమీంచి. సత్యం గదిని తేరపారజూశాడు. గదికొంచంకూడా మారలేదు నిన్నతను పెట్టివెళ్ళినట్టున్నాయి సామాన్లు. సుశీల ముఖంలో మనో ప్రశాంతత కనబడింది. కొంచంకూడా మార్పులేదు. తను, ఎన్నో, ఏవో వూహించుకున్నాడు. ఆఖరికి తెల్లవెంట్రుకకూడా లేదు ఆమె తలలో.

సుశీలను చూశాక తనీ అయిదేళ్ళలో ఎంతమార్పు పొందినదీ అతనికి మొదటిసారి తట్టింది.

సుశీల పైకివచ్చింది. తలలోని జాజులు గుప్పుమన్నాయి. సత్యాన్ని రోజూచూస్తున్నట్టే ప్రవర్తించింది. ఆమెకు ప్రశ్నలులేవు సుశీలకు యీ లోతు భగవంతుడు ఏ తపస్సుకిమెచ్చి ప్రసాదించాడో!

తలదగ్గిరకూచుని చెక్కిళ్ళు నిమురుతోంది. సత్యం తొడుక్కున్నలాల్చీ గుండీలు సరిగా పట్టడంలేదు. సుశీల దగ్గిరకులాగి పెట్టింది. యింకాగుండెలు కనబడ్తూనే వున్నాయి. సుశీల కిలకిల నవ్వింది. సత్యం తృప్తిగా నవ్వాడు.

వార్ టైములో యిద్దరూ వుండగా సుశీల ఆ లాల్చీ కుట్టింది. అప్పుడు సత్యానికి చాలా వదులుగా వుండేది. అందువల్ల పెట్లో అడుగున పడేసింది సుశీల. ఆ పాతదాన్ని తీసి యీనాటి రాత్రి తొడిగింది సత్యానికి.

ఇద్దరూ భావయుక్తంగా నవ్వారు.

కిటికీలోంచి నక్షత్ర కాంతి పడుతోంది పక్కమీద. ఆ కాంతిలో పక్కన సుశీల. ఏదోలోకంలో వున్నట్టుంది సత్యానికి.

“సుశీ” అన్నాడు సత్యం మృదువుగా.

“వ్యక్తిత్వాన్ని గురించి కథలు రాశారుగాని, పక్కమనిషి వ్యక్తిత్వాన్ని భరించలేక పోయారు. స్త్రీకి భార్య అవటంకంటే ఎక్కువ ఆశయంకూడా వుంటుందని మర్చిపోకండి” అంది సన్నగా నవ్వుతూ.

ఆ కిలకిలనవ్వు సన్నగాపారే సెలయేరుని జ్ఞప్తికి తెస్తుంది. సెలయేరు గట్టుకెళ్ళి-నువ్వు నాపక్కనేపాడు ఆ గలగలశబ్దం నా ఒక్కడికోసమే చెయ్యి ‘అనడం, చంద్రుణ్ణి’ ఆ వెన్నెల నాకేయియ్యి, నా ఇట్లోనే కట్టేసుకుంటాన’నడం, మల్లెల సువాసన ‘నాకొక్కడికే కావాలి నా జేబులోనే వుంచుకుంటాన’నడం- యిలాంటివి ఎంత అసాధ్యమో సుశీలకు పట్టుకోడం కూడా అంతే!- అనిసత్యానికి ఒక గొప్పనిజం తట్టింది.

అన్నీ- లక్షలు, భార్యాపిల్లలూ, యిన్‌కమ్‌టాక్సు, కొడైకనాలు- అన్నీ మబ్బుల్లో కలిసిపోయాయి. జీవితాన్ని వెలిగించే ప్రేమజ్యోతి కనిపించింది సత్యానికి సుశీల ముఖంలో.

